# ఇది కథ కాదు

■ ద్వారకా

"మన శివుడు పబ్లికులో ఐదొందల ఇరవై మార్కులు సంపాదించాడన్నా. జిల్లా ఫస్టు మనోడేనంట. మరో పది మార్కులొస్తే బాగుండేది. స్టేట్ ర్యాంకు వచ్చేది. వెధవ పది మార్కులతో స్టేట్ ర్యాంకు పోయిందిగదన్నా." బస్సులో నా పక్క సీట్లోనే కూర్చున్న గోపాలయ్య అన్నాడు.

పది మార్కులు వెధవ్వో, స్టేట్ ర్యాంకు వెధవదో తేల్చుకోలేక నేనేమీ మాట్లాడలేదు.

శివుడి మార్కుల గురించి నాకు ముందే తెలుసు. నా కొడుకు సెకండ్ క్లాసులో పాసయ్యాడు. వాడు చెప్పాడు నాతో.

తేలు కుట్టిన, సారాయి తాగిన కోతిలా గోపాలయ్య ఊరంతా పనిగట్టుకొని గంతులేస్తూ, తిరిగి టముకు వేశాడు. శివుడు టాకాఫ్ ది టౌన్ అయ్యాడు ఒక రోజంతా.

గోపాలయ్య పెద్ద చదువులు చదవలేదు. పెద్ద హోదా గల ఉద్యోగమూ చెయ్యటం లేదు.

రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులో అటెండరుగా పని చేస్తున్నాడు. అక్కడ వచ్చే ఆదాయాన్ని అందుకునేందుకు అతని రెండు చేతులూ చాలటం లేదు.

లోపల ఏ భావాలున్నా బయటకు మాత్రం అందరూ గోపాలయ్యను, అతని కొడుకు శివుణ్ణి పొగడ్తలతో ముంచేసిన మాట మాత్రం యథార్థం.

స్కూలు టీచర్లందర్నీ తన ఇంటికి విందు భోజనానికి ఆహ్వానించి వారుణీవాహినిలో ముంచి తేల్చాడు.

సంతోషంతో గోపాలయ్య సారాయి తాగి గంతులేస్తే, అతని మీసాలు ఎగబట్టి మరింత రెచ్చగొట్టిన వాళ్ళు చాలామందే ఉన్నారు.

"అందరూ నెల్లూర్లో చేర్పించమంటున్నారన్నా! అంత తెలివిగలవాడు మనూరు కాలేజీలో చేరితే చెడిపోతాడంటున్నారు. వాళ్ళమ్మ చెవిలో ఇల్లుగట్టుకొని పోరుతున్నది 'నెల్లూరు పంపు - నెల్లూరు పంపు' అని. టీచర్లయితే చెప్పనక్కర్లేదు. నాచేత పరుగులు తీయిస్తున్నారు. మనూళ్ళో చేర్పిస్తే, వాళ్ళు చేసిన కృషంతా బూడిదలో పోసిన పన్నీరవుతుందిట." కింగ్ సైజు సిగరెట్టు వెలిగించుకొని దమ్ము లాగుతూ పెద్ద పోజు పెట్టాడు గోపాలయ్య. అందులో దర్జా ఉంది. దర్పం ఉంది.

టీచర్లు వారి కృషి వల్లే వాడికి అన్ని మార్కులు వచ్చాయని రొమ్ములు బాదుకుంటున్నారు. ఆ స్కూల్లో చదివి పరీక్ష రాసినవాళ్ళు వంద మంది దాకా ఉన్నారు. వాళ్ళలో శివుడు ఒక్కడే అన్ని మార్కులు సంపాదించుకున్నాడు. చాలా మంది ఫెయిలయినారు. టీచర్ల కృషి అందరు విద్యార్థులకూ ఎందుకు సమానంగా అందలేదో ఎవరూ చెప్పరు.

"ఇంతకూ నువ్వేం చెయ్యాలనుకుంటున్నావు గోపాలయ్యా" అన్నాను ఉండబట్టలేక.

"నేనూ పంపుదామనే అనుకొంటున్నానన్నా. మనూరి కాలేజీలో ఏముంది మట్టి, మశానం తప్ప. ప్రిన్సిపాలే కాలేజీకి పోడు. వారానికోసారి దర్శనమైతే ఎక్కువంట! ఆయనే అట్లా ఉంటే ఇక లెక్చరర్ల మాట చెప్పేందుకేముంటుంది?"

అతను చెప్పింది అబద్ధం కాదు. వాళ్ళు సంతకాలు పెట్టి జీతాలు తీసుకుంటున్నారు, సమాజంలో హోదాలు అనుభవిస్తున్నారు. జనం వారి గురించి ఆలోచించాలి గాని, వారు జనం గురించి ఆలోచించరు. అందుకే కాలేజీలో చేరే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతున్నది. కాలేజీ మూసేస్తారన్న వదంతులు కూడా సంచారం చేస్తున్నాయి.

ప్రతిభ గల విద్యార్థుల కోసమంటూ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ప్రారంభించింది. కొంత కాలం తరువాత మేమూ తక్కువ తినలేదంటూ కేంద్ర ప్రభుత్వం 'నవోదయ విద్యాలయాలు' ప్రారంభించింది. చేయూత కావాల్సింది ప్రతిభ లేకుండా చతికిలబడుతున్నవాడికి గాని, ప్రతిభ గలవాడి కెందుకు? సూర్యుణ్ణి దివిటీలు మరింత కాంతివంతం చెయ్యగలవా?

ప్రభుత్వం నుంచి ఉప్పందుకున్న మేధావులు రెసిడెన్షియల్ స్కూళ్ళను, కాలేజీలను తామరతంపరగా ప్రారంభించారు. విద్య చాలా లాభసాటి వ్యాపార వస్తువుగా మారిపోయింది. ప్రతిభ లేని వారిని గూడా మేం ప్రతిభావంతులుగా తయారు చెయ్యగలమని ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వ టీచర్లు చేయూతనందించారు. తమ వ్యక్తిత్వాన్ని, ప్రాభవాన్ని పోగొట్టుకుంటున్నామన్న ఆలోచన ఆ అవకాశవాదులకు రాలేదు.

ఉపాధ్యాయ సంఘాలు పాపం సమ్మెలు, పే కమిషన్లు, టి.ఏలు, డి.ఏలు, జీతం స్కేళ్ళు వగైరా సమస్యలతో తలమునకలుగా అయినారు. వృత్తి బాధ్యతలకు స్వస్తి చెప్పారు.

తాతల కాలం నుంచీ మనం మట్టి పిసుక్కుంటూ బతికాము. మన గతి మన పిల్లలకు పట్టగూడదు. వాళ్ళూ మంచి విద్యావంతులు కావాలి. ఏదో గవర్నమెంటు ఉద్యోగం సంపాదించుకోవాలి. గుడ్డలు నలక్కుండా, క్రాపులు చెరక్కుండా, అందరి వందనాలందుకోవాలి. హాయిగా బతకాలి అనే కోరిక అధిక శాతం జనంలో పెల్లుబికింది. దాన్ని బాగా సొమ్ము చేసుకుంటున్నారు ప్రైవేటు కాలేజీలవాళ్ళు.

దేశంలో ప్రజలంతా విద్యావంతులు కావాల్సిందే. అప్పుడే దేశం ప్రగతి మార్గంలో నడవగలుగుతుంది. సందేహం లేదు.

కానీ, పెల్లుబికిన అభిమానం విద్యమీద కాదు, విద్య వల్ల లభించే ప్రభుత్వోద్యోగం మీద, తద్వారా లభించబోయే అనేకానేక ప్రయోజనాల మీద!

అందువల్ల విద్య వంకర్లు తిరిగింది. వక్రమార్గం పట్టింది.

విద్యారంగంలో గొంతులు కోసుకునే పోటీ ఏర్పడింది. ప్రైవేటు స్కూళ్ళ, కాలేజీల పంట పండింది.

"అదే మంచిది. ఖర్చుకు తట్టుకోలేనివాడివి కాదుగదా! నెల్లూర్లోనే చేర్పించు. మంచి కాలేజీ ఎంచుకో" అన్నాను.

గోపాలయ్య చేతిలో దినపత్రిక ఉంది. దాన్ని తెరచి చూపించాడు నాకు. పూర్తి పేజీ, అర్ధ పేజీ, పావు పేజీల ప్రకటనలు చాలా ఉన్నాయందులో. కొన్ని ప్రకటనలు పంచ రంగుల్లో ఉంటే, కొన్ని నలుపు, తెలుపుల్లో ఉన్నాయి. తమ కాలేజీల్లో చదివి ర్యాంకులు సంపాదించుకున్న విద్యార్థినీవిద్యార్థుల ఫోటోలు గూడా ప్రచురించారు.

"మా చదువులు గొప్పవి. మేము చెప్పే విధానం విశిష్టమైనది. మా కాలేజీలో బ్రహ్మాండమైన వసతులున్నాయి. మా లెక్చరర్లు గొప్ప గొప్ప మేధావులు. ఆయా రంగాలలో లబ్ధప్రతిష్ఠులు" అంటూ తమ గొప్పతనమంతా చాటుకున్నారు వాటిలో.

ఒకే సిలబస్. ఒకే పాఠ్యాంశాలు, ఒకే పరీక్షలు- అందుకు విద్యార్థులను తయారుచేసే విధానం మాది మంచిదంటే మాది మంచిదని పోటీలు పడుతున్నారు. జనం చేత నమ్మిస్తున్నారు.

ఆ ప్రకటనలన్నిటినీ చూసి నా మనసు పరిపరి విధాలా పోయింది. ఈ ఫోటోల్లో ఉన్న విద్యార్థినీ విద్యార్థులేనా వీరి కాలేజీల్లో చదివింది? మిగిలినవాళ్ళ మాటేమిటి?

"వీటిలో దేంట్లో చేర్పిస్తే మంచిదంటావన్నా?" అడిగాడు గోపాలయ్య.

"నాకు మాత్రమేం తెలుస్తుంది గోపాలయ్యా! వీటిలో ఎన్ని నిజాలున్నాయో, ఎన్ని అబద్ధాలున్నాయో కనిపెట్టటం బ్రహ్మతరం కూడా కాదు" అన్నాను.

"నెల్లూర్లో మన బంధువులున్నారు. ఏవో కాంట్రాక్టు పన్లు చేస్తున్నాడ్లే నా బావమరిది. ఒక రోజు పోయి వాడితో మాట్లాడుతాను."

"వెంటనే ఆ పని చెయ్యి. అదే మంచిది" అన్నాను.

"అక్కడికి పోయి రావటం కష్టం కాదుగాని, ఇక్కడ ఒక్కరోజు లేకపోయినా నష్టం ఎక్కువే."

"ఒక్కరోజు ఆదాయం గురించి ఆలోచించొద్దు పిచ్చి గోపాలయ్యా! శివుడి భవిష్యత్తు గురించి ఆలోచించు. వాడు ఏ ఇంజనీరో, డాక్టరో అయితే వాడి జీవితం ఎలా ఉంటుందో ఆలోచించు. బంగారం ఇటుకలతో ఇళ్ళు కట్టిస్తాడయ్యా! అసలు ఎన్ని లక్షలు కట్నం ఇచ్చి పిల్లనిస్తామంటూ ఎందరు ఐశ్వర్యవంతులు నీ ఇంటిముందు క్యూ కడతారో ఊహించుకో" అంటూ అతన్ని ప్రోత్సహించాను. అతన్ని నిరుత్సాహపరిస్తే నాకు దూరమవుతాడు.

నిజానికి నా ప్రోత్సాహం అతనికవసరం లేదు. అన్నీ ఆలోచించగల సమర్థుడతను.

నేను బస్సు దిగాల్సిన స్టేషనొచ్చింది. గోపాలయ్యకు వీడ్కోలు చెప్పి బస్సు దిగాను.

వారం రోజుల తరువాత గాని గోపాలయ్య నాకు తిరిగి తటస్థపడలేదు. నేనే పలకరించానతన్ని.

"శివుడి విషయం ఏం చేశావు గోపాలయ్యా"

"నెల్లూరు పోయొచ్చానన్నా. అవి ఏం బిల్డింగులు! ఏం కాలేజీలు! కట్టలు కట్టలు డబ్బు. బ్యాంకుల్లో గూడా అన్ని కట్టలుండవన్నా! నాకు కళ్ళు తిరిగి పోయాయనుకో. ఎంత రష్షో ప్రతి కాలేజీలోను."

"ఇంతకూ శివుణ్ణి ఏ కాలేజీలో చేర్పిస్తున్నావు"

"చేర్పించేశానన్నా" అంటూ కాలేజీ పేరు చెప్పాడు.

> తాతల కాలం నుంచీ మనం మట్టి పిసుక్కుంటూ బతికాము. మన గతి మన పిల్లలకు పట్టగూడదు. వాళ్ళూ మంచి విద్యావంతులు కావాలనే మన కోరికను ప్రైవేటు కాలేజీల వాళ్ళు సొమ్ము చేసుకుంటున్నారు.

దాని డైరెక్టరు ఇంతకు ముందు ఏదో గవర్నమెంటు కాలేజీలో ప్రొఫెసరంట. ఎంత పేరన్నా ఆయనకు. తిరుపతి దేవుణ్ణి చూసేందుకు జనం లైన్లు కట్టినట్లున్నది ఆయన ఇంటిదగ్గర, కాలేజీ దగ్గర! ఆయన కాలేజీలో అత్తెసరు మార్కులోళ్ళకు సీటే లేదన్నా. నేను మనోడేననుకున్నా. తాడి చెట్టెక్కే వాడుంటే వాడి తలదన్నేవాడున్నట్లు, మనోడికంటే ఎక్కువ మార్కులొచ్చినోళ్ళు ఎందరున్నారన్నా! మొదట్లో మనోడికి సీటు దొరకదని భయపడ్డా. నా బావమరిది అయినోళ్ళ, కానోళ్ళ కాళ్ళు పట్టుకొని ఎట్లాగో సీటు సంపాదించాడు." విజయగర్వం గోపాలయ్య ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపించింది.

"పోన్లే. అంత గొప్పాయన కాలేజీలో సీటు దొరకటం అదృష్టమే. ఇంతకూ ఫీజు ఎంతేమిటి?"

ఈ ప్రశ్న వేసింది నా కొడుకును చేర్పిద్దామని కాదు. అతను చెప్పిన పరిస్థితుల్లో చచ్చి గీ పెట్టినా మా వాడికి సీటు రాదు. మా వాడిలాంటి వెధవలకు గవర్నమెంటు కాలేజీలే గతి. వీళ్ళూ లేకపోతే ఆ కాలేజీలు, లెక్చరర్లు ఏం కాను!

"యాభైవేలు డిమాండు చేశాడన్నా."

"రెండేళ్ళకూ కలిపా?"

"నువ్వు బలేవాడివన్నా. ఏ ఏటి కాయేడే."

"అయితే, రెండేళ్ళకూ కలిపి లక్షవుతుందన్నమాట. ఇక పుస్తకాలకు, గుడ్డలకు, మిగిలిన ఖర్చులు తడిపి మోపెడవుతుందే!"

"నా బావమరిది మాట్లాడి నలభై తొమ్మిదికి కుదిర్చాడులే. రెండు ఇన్‌స్టాల్‌మెంట్లలో కట్టొచ్చునంట ఏ ఏటి కాయేడు. భోజనం వసతులు వాళ్ళే కల్పిస్తారంట. ఎం.సెట్ పరీక్షకు మొదటి నుంచే కోచింగిస్తారంట. పర్సనల్ కేర్ తీసుకుంటారంట." సంతోషంగా అన్ని విషయాలూ వివరంగా చెప్పాడు గోపాలయ్య.

"వెధవ డబ్బుదేముందిలే. రేపు శివుడు డాక్టరో, ఇంజనీరో అయితే లక్షలు గాదు, కోట్లు వాడి కాళ్ళ దగ్గరికి నడిచొస్తాయి... నువ్వు అదృష్టవంతుడివిలే గోపాలయ్యా! శివుడి లాంటి తెలివిగల పిల్లాడికి జన్మనిచ్చావు" అన్నాను అతన్ని ప్రశంసిస్తూ.

"మనదేముందన్నా! అంతా ఆ ఏడుకొండలవాడి దయ! అప్పుడే మూడు రోజులైంది శివుడు కాలేజీలో చేరి. మొదటి ఇన్‌స్టాల్‌మెంటు గూడా కట్టేశాను. "కైలాస శిఖరం ఎక్కినంత సంతోషంగా ఉన్నాడు గోపాలయ్య.

అవును మరి. ఆ సంతోషం, ఆ ఆనందం, వగైరాలు నాబోటి లబూటుగాళ్ళకు గగన కుసుమమే.



చిత్రాలు: నర్సిం

* * *

ఈ మధ్య గోపాలయ్య బస్సులో నన్ను కలవడం లేదు. అసలతను బస్సులో ప్రయాణం చెయ్యటం లేదు. హీరో హోండా ఒకటి కొన్నాడు. దాని మీదనే రాకపోకలు సాగిస్తున్నాడు.

నేను నా పనుల్లో నిమగ్నమయినాను.

"ఆ గోపాలయ్య కొడుకు చూడు. అన్ని మార్కులు సంపాయించుకున్నాడు. రేపు వాడు యే కలెక్టరో అయితే వాడి దగ్గర గుమాస్తాగా నయినా అయ్యేందుకు చదవరా. రోజూ మీ నాన్న ముందు కూచొని చదువు." అంటూ కొడుకును శత పోరుతున్నది నా భార్య.

"గోపాలయ్య చూడు, నెల్లూర్లో కొడుకును చేర్పించి చదివించుకుంటున్నాడు. కనీసం అంత సత్తువ లేకపోయినా, వాడిని నీ ముందు కూచోబెట్టుకొని చదివించు. లేకపోతే వాడు పరీక్ష ఫెయిలయి జులాయి వెధవగా తయారువుతాడు" అని నన్ను గాబరా పెట్టేస్తున్నది.

వాడికి, నాకు ఆవిడ ఆజ్ఞపాలన చెయ్యక తప్పలేదు.

ఇంటర్ మొదటి సంవత్సరం పాసయ్యాడు మా వాడు. గొప్పగా మార్కులేం రాలేదు. రెండో సంవత్సరం గూడా అన్ని సబెక్టుల్లోను పాసయినాడు.

నా శ్రద్ధ, వాడి కృషి వృథా కాలేదు. అందుకు సంతోషించాము కుటుంబంలోని అందరం.

వాడు పదో తరగతిలోలా ఇంటర్‌లో గూడా సెకండ్ క్లాస్‌లోనే పాసయినాడు.

ఎంత చదివినా అంతకు మించి ఎదగలేక పోయాడు వాడు. వాడి శక్తి అంతవరకే పరిమితం అని సరిపెట్టుకున్నాను.

పూర్వం మా రోజుల్లో యస్.యస్.ఎల్.సి పాసుతో ఉద్యోగార్హత లభించేది. పొట్ట పోసుకునేందుకు చిన్నదో, చితకదో ఉద్యోగం సంపాదించుకునే వీలుండేది.

ఇప్పుడు ఎంత చదివినా ఉద్యోగార్హత లభించదు. విద్యాబోర్డులు, విశ్వవిద్యాలయాలు ఇచ్చే సర్టిఫికెట్లు, పట్టాలు చెల్లని దొంగనోట్లతో సమానమయినాయి. వాటికి విలువ లేకుండా చేశారు.

జవాను ఉద్యోగానికి పిహెచ్.డి చేసినవాడు అప్లయ్ చేసినా టెస్టులు, ఇంటర్వ్యూలు తప్పనిసరి. జవాను ఉద్యోగానికి సిద్ధపడేవాడు అంత చదువు ఎందుకు చదువుతాడో నా కంతుపట్టని విషయం.

యస్.యస్.ఎల్.సిలోంచి 'ఎల్'ను తీసిపారేసి యస్.యస్.సిగా కుదించి మేధావులు ఏం సాధించారో అర్థం కాదు. దాని తరువాత అజాగళ స్తనాల్లాంటి రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్, అది పాసయితే గాని వృత్తి విద్యలకు ప్రవేశార్హత ఉండదు.

చచ్చీ చెడి ఏ వృత్తివిద్యా కోర్సు పాసయినా నేరుగా ఉద్యోగార్హత లభించదు. టెస్టులు పాసు



కావాలి.

అందులో ర్యాంకులు రావాలి. అదో పెద్ద వ్యాపారం.

ర్యాంకు సాధించే సామర్థ్యం నా సుపుత్రుడికి లేదని ఎవరో చెప్పనవసరం లేదు. నాకే తెలుసు.

వాడు ప్రభుత్వ ఉద్యోగంలో చేరడమంటే కుందేటి కొమ్మును సాధించడమే.

వాణ్ణి ఏ చిన్న ఉద్యోగంలోనయినా చేరిస్తే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా ఉపయోగపడతాడని ఆశపడ్డాను. నా రెండో సగానికి చదువు రాదు. డిగ్రీల్లేవు. ఏ ప్రయివేటు సంస్థలోనయినా చేరుద్దామని శతథా ప్రయత్నించాను. ప్రతిచోటా బి.ఏలు, ఎం.ఏలు చదివినవాళ్ళు కొల్లలుగా అడ్డ తగులుతున్నారు. నా ఆశ నిరాశ అయింది.

వయసులో ఉన్న కుర్రాడు పనీపాటా లేకుండా ఊరికే ఇంట్లో ఉంటే ఎంత ప్రమాదకరమో నాకు తెలుసు. సోమరిపోతుగా తయారవుతాడు. సైతానుగాడి చేతికి మరింత పని దొరుకుతుంది. వాణ్ణి ఇంట్లో కూర్చోబెట్టుకుంటే చేజేతులా చెడగొట్టుకున్నట్లే అవుతుంది.

రాబోయే ప్రమాదాన్ని వాయిదా వేసుకునేందుకు వాణ్ణి డిగ్రీ కోర్సులో చేర్పించాలని నిర్ణయించుకున్నాను తగిన శక్తి లేకపోయినా.

మా ఊరికి పది మైళ్ళ దూరంలో ఒక పట్నం ఉంది. అక్కడో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. అందులో చేరి చదువు కొనసాగించాలని చాలా ఉత్సాహపడ్డాడు మావాడు.

అక్కడ ఏయే కోర్సులున్నాయో శ్రద్ధగా తెలుసుకున్నాడు.

"అక్కడ కంప్యూటరు కోర్సు గూడా ఈ సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నారుట నాన్నా. కంప్యూటరులో డిగ్రీ తెచ్చుకుంటే ఉద్యోగం తేలిగ్గా దొరుకుతుందని అంటున్నారంతా. అందులో చేర్పించు నాన్నా. రోజూ ఉదయం పోయి, సాయంత్రం వచ్చేస్తాను. బుద్ధిగా చదువుతాను" అంటూ మారాం చేశాడు.

ఎంత చెడ్డా కన్న కొడుకు. మా గారాల కూచి. బంగారు కొండ. శక్తి లేకపోయినా వాడి కోరిక తీర్చక తప్పలేదు. అక్కడా ఆ కోర్సుకు విపరీతమైన పోటీ ఉంది. ప్రిన్సిపాలు గారి కాళ్ళు, ఇద్దరు ముగ్గురు లెక్చరర్ల కాళ్ళు పట్టుకొని అందులో మా వాడికి సీటు సంపాదించాను.

నిరుద్యోగ పెనుభూతం కోరల్లోంచి తాత్కాలికంగానయినా వాడిని కాపాడగలిగినందుకు భార్యాభర్తలమిద్దరం పరమానంద సంభరితులమయినాము.

* * *

ఆ రోజు గూడా మామూలుగా ఎక్కే బస్సు కోసం ఎదురు చూస్తూ రోడ్లో నుంచున్నాను.

"బాగున్నావా అన్నా?" తనకు తానే వచ్చి పలకరించాడు గోపాలయ్య.

"ఓ! గోపాలయ్యా! నువ్వా! ఎంతకాలమైందయ్యా మనం కలుసుకొని! ఇక్కడెందుకున్నావు" అన్నాను సంతోషంగా.

"బండి టైరు పంచరయిందన్నా! కొత్తదేయించాలంటే కుదరటం లేదు. బండి మెకానిక్కు దగ్గరిచ్చి కూచున్నాను. ఇంతలో నువ్వు కనిపించావు. శానా రోజుల తరువాత కనిపించావు. టీ తాగుదాం రా అన్నా" అంటూ చెయ్యి పట్టుకొని టీ బంకు దగ్గరికి లాక్కుపోయాడు.

"కొత్త టైరు కొనటం కుదరలేదని బీద పలుకులు పలుకుతున్నావేంటి గోపాలయ్యా! కొడుకు యం.బి.బి.ఎస్‌లో చేరాడా? బి.ఇలో చేరాడా" అన్నాను కుతూహలంగా.

"లేదన్నా! ఎంట్రెన్సులో మనోడికి ర్యాంకు రాలేదు. అబద్ధమెందుకన్నా నీతో! వాడసలు పాసు కాలేదు." తలవంచుకొని అన్నాడు గోపాలయ్య.

"ఎలాగో ఇంటరు మాత్రం పాసయినాడు నా పరువు మొత్తం పోకుండా."

నోరు తెరిచాన్నేను ఆశ్చర్యంతో.

ఒక నిమిషం తరువాత తేరుకొని, "అయితే, అంత డబ్బు బూడిదలో పోశావన్నమాట" అన్నాను.

"ఆ డబ్బు పోయినందుకు చింత లేదన్నా! పిల్లోడు సినిమా హీరోలా తయారయినాడు. మహా ఖర్చుగాడుగా మారాడు. ఎంత డబ్బూ చాలటం లేదు వాడికి."

"ఇంతకూ ఇప్పుడేం చేస్తున్నాడేంటి?" అడిగాను.

"బెంగుళూర్లో కంప్యూటరు బి.యస్సీలో చేరాడు.

"ఇక్కడి కాలేజీలో గూడా కంప్యూటరు బి.యస్సీ ఉంది గద గోపాలయ్యా. మా వాణ్ణి అందులోనే చేర్చాను. ఇంతదానికి బెంగుళూరెందుకు?"

మా ఊరికి పది మైళ్ళ దూరంలో ఉన్న పట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ప్రిన్సిపాలు గారి కాళ్ళు, ఇద్దరు ముగ్గురు లెక్చరర్ల కాళ్ళు పట్టుకొని అందులో మా వాడికి సీటు సంపాదించాను.

"ఇక్కడే చేర్రా అని మొత్తుకున్నానన్నా. చేరనంటే చేరనని మొండికేశాడు. వాడికి అవమానంట."

"అవమానమా! ఎందుకట?"

"నెల్లూర్లో చదివినోడు అంతకంటే పెద్ద ఊర్లో చదవాలగాని, చిన్న ఊళ్ళో చదివితే మతింపు ఉండదుట. బెంగుళూర్లో అయితేనే చదువుతానని మొండికేశాడు. వాణ్ణి ఇంట్లో ఉంచుకోవడం కంటే బయటికి పంపటమే మంచిదనిపించింది. అందుకే పంపేశాను. వాడి కోసం అప్పులు చెయ్యటం తప్పటం లేదు. మూడేళ్ళలో మూడు లక్షలు తినేట్లున్నాడు నా కొడుకు!"

ఇప్పుడు గోపాలయ్యను చూచి నేను అసూయ పడటం లేదు.

ఓడలు బండ్లవటమంటే ఇదేనేమో!

'పాపం గోపాలయ్య' అనుకున్నాను.

ఇంతలో టైరుకు పంక్చరు వేసి బండిని సిద్ధం చేశాడు మెకానిక్కు. తన బండి మీదనే ఊరికి తీసుకుపోయాడు నన్ను.

* * *

ఇందులో గోపాలయ్య తప్పు అణుమాత్రం గూడా లేదు.

లోపమంతా మారుతున్న విలువల్లో ఉంది. జనాన్ని తప్పు దారి పట్టిస్తూ స్వార్థ ప్రయోజనాలను పుష్కలంగా సాధించుకుంటున్న ప్రకటన కర్తల్లో ఉంది.

అతను ఏమాత్రం చెమటలు పట్టకుండా రెండు చేతులతోను అతి తేలికగా సంపాదిస్తున్న డబ్బులో ఉంది.

ఆ డబ్బు అందిస్తున్న వారిలో ఉంది. దాన్ని పట్టించుకోని అధికారుల్లో ఉంది.

చదువు ద్వారా మనుషులు కావాలని ఎవరు కోరుతున్నారిప్పుడు?

డబ్బు కావాలని కోరుతున్నారు.

అది పుష్కలంగా సంపాదించేందుకు ఇంజనీర్లు కావాలంటున్నారు. డాక్టర్లు కావాలంటున్నారు. ఐ.ఏ.ఎస్, ఐ.పి.యస్ ఆఫీసర్లు కావాలంటున్నారు.

మనుషులు మాయమవుతున్నారు. మానవత్వం మంట గలుస్తున్నది.

గోపాలయ్య మరో పదేళ్ళపాటు ఉద్యోగంలో ఉంటాడు. దొరకనంత కాలం దొరగానే చలామణీ అవుతాడు. ఫరవాలేదు.

గోపాలయ్యలాంటి వాళ్ళను ఆదర్శంగా తీసుకొని ఎండమావుల వెంట పరుగులు తీస్తున్న మామూలు మనుషులు మాత్రం శంకరగిరి మాన్యాలు పడుతున్నారు.

అలాంటి దగా పడుతున్న తమ్ముళ్ళకే ఈ 'కథకాని కథ' అంకితం. ■